# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికీ మూడురోజుల్లోగా నిత్యావసరాల కిట్లను అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **తెలంగాణలో వరద నష్టం తీవ్రంగా ఉందని, తక్షణ సాయంతో పాటు శాశ్వత పునరుద్ధరణ పనులకు తగిన నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కోరారు.**
3. **రాజకీయాలకు అతీతంగా తెలంగాణ వరద ప్రాంతాల్లోని ప్రజలను కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టంచేశారు.**
4. **రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద నష్టం అంచనా వేసేందుకు ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ ఏర్పాటు చేశామని కేంద్ర హోంమంత్రిత్వశాఖ వెల్లడించింది.**
5. **భారతదేశాన్ని అంతర్జాతీయ మత్స్య సంపద శుద్ధి కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించారు.**

===========================

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికీ మూడురోజుల్లోగా నిత్యావసరాల కిట్లను అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తెలిపారు. బుడమేరు గండ్లు పూడ్చటమే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలపై విజయవాడ కలెక్టరేట్ వద్ద నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. వరద ప్రాంతాల్లో బాధితుల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టామని. నీరు నిల్వ ఉన్న చోట తప్ప మిగిలిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని ముఖ్యమంత్రి వివరిస్తూ..

వాయిస్ 33 సెకన్లు

అంతకుముందు ఆయన విజయవాడ పరిసరాల్లోని వరద ముంపు ప్రాంతాలను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. బుడమేరు ప్రవాహం, ముంపు, గండ్లు పడిన ప్రాంతాలు, కొల్లేరు పరిసరాలతో పాటు.. ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణా నది ప్రవాహాన్నీ ముఖ్యమంత్రి పరిశీలించారు.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వరద ప్రభావిత గ్రామాల్లో సహాయ చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా

పనులను సమర్థంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సహాయ కార్యక్రమాలపై నిన్న సమీక్ష నిర్వహించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాల వారీగా సహాయ చర్యల పర్యవేక్షణకు అధికారుల బృందాలను ఏర్పాటుచేశారు.

---------------------------

తెలంగాణలో వరద నష్టం తీవ్రంగా ఉందని, తక్షణ సాయంతో పాటు శాశ్వత పునరుద్ధరణ పనులకు తగిన నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో వరదల వల్ల సుమారు 5 వేల 438 కోట్ల నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచానా వేశామని వివరించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం.. ఎస్‌డీఆర్ఎఫ్ నిధుల విడుదల విషయంలో మార్గదర్శకాలను సడలించాలని కోరారు. నిన్న సచివాలయంలో కేంద్ర మంత్రికి వరద ప్రభావం, నష్టాన్ని ముఖ్యమంత్రి, అధికారులు చిత్రమాలిక ద్వారా వివరించారు. పలు జిల్లాల్లో ఒక్క రోజే 40 సెంటీమీటర్ల వర్షం కురిసిందని, రహదారులు, ఇళ్లు, వంతెనలు దెబ్బతిన్నాయని.. రాకపోకలు స్తంభించాయని తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర పంట నష్టం జరిగిందని.. పొలాలన్నీ రాళ్లు, ఇసుక మేటలతో నిండిపోయాయని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు.

---------------------------

రాజకీయాలకు అతీతంగా తెలంగాణ వరద ప్రాంతాల్లోని ప్రజలను కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ స్పష్టంచేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో కలిసి నిన్న ఆయన ఖమ్మం జిల్లా పాలేరు మండలంలో ముంపు ప్రాంతాలను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించి, రైతులతో ముఖాముఖి మాట్లాడారు. భవిష్యత్తులో ఇటువంటి విపత్తులు సంభవించినప్పుడు సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాలను, తెలంగాణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆదుకుంటాయని తెలిపారు.

---------------------------

రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద నష్టం అంచనా వేసేందుకు ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ ఏర్పాటు చేశామని కేంద్ర హోంమంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొంది. వరద ప్రాంతాలకు ఇప్పటికే నిపుణుల బృందాన్ని పంపామని తెలిపింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితి, ఆనకట్టలు, వాటి భద్రతను కేంద్ర బృందం పరిశీలిస్తుందని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో 26 జాతీయ విపత్తు నిర్వహణ దళాలు.. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 8 వైమానికదళ హెలికాప్టర్లు, 3 నౌకాదళ హెలికాప్టర్లు, డోర్నియల్ ఎయిర్‌క్రాఫ్ట్ సహాయకచర్యలో పాల్గొన్నాయని తెలిపింది. రాష్ట్రంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు 350 మందిని కాపాడాయని.. 15వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయని పేర్కొంది. తెలంగాణలో 26 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 2 వైమానికదళ హెలికాప్టర్లు ఉన్నాయని వెల్లడించింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తెలంగాణలో 68 మందిని రక్షించాయని, 3 వేల 200 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయని కేంద్ర హోంమంత్రిత్వశాఖ తెలిపింది.

---------------------------

భారతదేశాన్ని అంతర్జాతీయ మత్స్య సంపద శుద్ధి కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించారు. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులను

ప్రోత్సహించడానికి సంబంధిత రంగాల నిపుణులు, వ్యాపారులు, ఎగుమతిదారులతో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిన్న సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో మన దేశం రెండో స్థానంలో ఉందన్నారు. టూనా చేపల ఎగుమతి కేంద్రంగా అండమాన్, లక్ష దీవుల ను అభివృద్ధి చేస్తామని అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు.

---------------------------

భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి విపత్తులు రాకుండా చూడాలని ఆ మహాగణపతిని ప్రార్థిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండు రాష్ట్రాలు సహా దేశ, విదేశాల్లోని తెలుగువారికీ ఆయన వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుడి దయతో అందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ కూడా వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గణేశ్ మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని కోరారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని వినాయకుడిని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రజలు భక్తిప్రపత్తులతో వినాయక చవితి పండుగ జరుపుకొంటున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శర వేగంగా జరుగుతున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తి అయ్యాయని, విమానాశ్రయ నిర్మాణాన్ని ఆరు నెలల ముందే పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులను నిన్న ఆయన పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. రన్ వే, టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, అత్యాధునిక నమూనాతో ఈ విమానాశ్రయ నిర్మాణం జరుగుతోందన్నారు. భూములు ఇచ్చిన వారికి అన్నివిధాలా న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు.

---------------------------

బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఉత్తరదిశగా ప్రయాణిస్తూ సోమవారం నాటికి ఒడిశా, పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తీరాలకు సమీపంలో వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత 3-4 రోజుల్లో అది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తుందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతోపాటు రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో రాబోయే మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తాజిల్లాల్లో పలుచోట్ల మంగళవారం వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశముందని.. రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అల్ప పీడనం ప్రభావంతో తెలంగాణలోనూ ఈరోజు ఒక మోస్తరు వర్షాలు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

--------------------------

మాతృ భాషలో విద్యాభ్యాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతీయ విద్యా విధానం ప్రభావం గురించి జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో నిన్న ఆయన ఢిల్లీలోని తన నివాసంలో జరిగిన సమావేశంలో చర్చించారు. ఉపాధ్యాయులు వివిధ భాషల్లో జానపద కథలను విద్యార్థులకు వినిపించాలని, దీనివల్ల విద్యార్థులు బహుళ భాషలు నేర్చుకొనడంతో పాటు మన దేశ చైతన్యవంతమైన సంస్కృతి గురించి తెలుసుకుంటారని ప్రధానమంత్రి తెలిపారు. మన సాంస్కృతిక వైవిధ్యం గురించి విద్యార్థులకు పరిచయం చేసేందుకు ఉపాధ్యాయులు వారిని విహారయాత్రలకు, విజ్ఞాన యాత్రలకు తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. దీనివల్ల వారి అభ్యాసం పెరగడమే కాక సంపూర్ణమైన పద్ధతిలో తమ దేశం గురించి తెలుసుకుంటారని అన్నారు.

======================